# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 21-05-2016**

రానున్న అగస్టు నెల 12వ తారీఖునుంచి ప్రారంభం కానున్న కృష్ణా పుష్కరాల నిర్వహణకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాసారు. కృష్ణానది పుష్కరాల నిర్వహణకుగాను మొత్తం అంచనా వ్యయం రూ. 802.19 కోట్లు ఖర్చుకానున్నదని తెలిపారు. అందులో కేంద్రం వాటాగా రూ.601.65 కోట్లు విడుదల చేయాల్సిందిగా ముఖ్యమంత్రి ప్రధానిని కోరారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి భారీ కార్యక్రమాలను ఆయా రాష్ట్రాలు నిర్వహించే సందర్భంగా కేంద్ర పాలిత ప్రాంతాలకు, రాష్ట్రాలకు కేంద్రం అందించే వన్ టైం సెంట్రల్ అసిస్టెన్స్ పద్దు కింద ఈ నిధులను విడుదల చేయాల్సిందిగా ప్రధానిని కోరారు.

తెలంగాణ రెండు జిల్లాల ద్వారా ప్రవహిస్తున్న కృష్ణానది పొడుగునా పుష్కర స్నానాలను ఆచరించేందుకు అవసరమయ్యే స్నానఘట్టాల నిర్మాణం తదితర మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులు అవసరమౌతాయని ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కృష్ణా పుష్కరాల ప్రాశస్త్యాన్ని ప్రధానికి సిఎం వివరించారు. ప్రతి పన్నెండేళ్లకు ఓసారి వచ్చే పుష్కరాలు ఈసారి, కన్యారాశిలోకి బృహస్పతి ప్రవేశంతో ప్రారంభమయి పన్నెండు రోజులపాటు జరుగనున్నాయని తెలిపారు.

తెలంగాణలో దాదాపు 281 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తున్న కృష్ణానది దేశంలోని 12 పవిత్ర జీవనదుల్లో ఒకటిగా వర్ధిల్లుతున్నదని వివరించారు. అత్యంత గొప్పగా ఇటీవల గోదావరి పుష్కరాలను నిర్వహించామని,

వాటిని దృష్టిలో వుంచుకుని వేసిన అంచనా మేరకు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 3.5 కోట్ల యాత్రికులు, భక్తులు కృష్ణా పుష్కరాల్లో పాల్గొననున్నారని సిఎం ప్రధానికి రాసిన లేఖలో తెలిపారు.

పుష్కరాల నిర్వహణకు అవసరమయ్యే ఆర్థికావసరాలు తదితర పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని కేంద్ర ఆర్థికశాఖకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిందని సిఎం వివరించారు. తాము కోరిన నిధులను త్వరలో మంజూరు చేసేందుకు చొరవ చూపాల్సిందిగా ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు.

**సిపిఆర్ఓ టు సిఎం**